క్లుప్తంగా

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

బూర్గంపాడు: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ డిమాండ్ చేశారు. సారపాకలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ మండల 9వ మహాసభను నిర్వహించారు. సారపాక ప్రధాన కూడలి నుంచి ఐటీసీ ఈస్ట్‌గేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎంబీ నర్సారెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. సీపీఎం అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం జరిగిన పార్టీ మహాసభలో ఏజే రమేష్ మాట్లాడారు. ఎన్నికల హామీలను అమలు చేయటంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. మహాసభలలో పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, పాపినేని సరోజని, అజయ్‌కుమార్, బయ్యా రాము, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ఇంటింటి సర్వే

ములకలపల్లి: మండల పరిధిలోని ముత్యాలంపాడు గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే నిర్వహించారు. పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ గ్రామాన్ని ఎంపిక చేయగా.. స్థానిక ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టారు. మండలప్రత్యేకాధికారి ఎం.రమేష్, తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మహాలక్ష్మి సర్వే తీరును పరిశీలించారు. కాగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు సర్వేను పరిశీలించారు. మడకం రవి, మడకం శ్రీను, కుంజా రాజేశ్, మడివి హరనాథ్, పొడియం వెంకట కృష్ణ, మడకం నర్సింహారావు తదితరులు ఉన్నారు.

నారచీరల ప్రాంతాన్ని సందర్శించిన తహసీల్దార్


నారచీరల ప్రాంతం వద్ద రోడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్ అశోక్

దుమ్ముగూడెం: మండల తహసీల్దార్ అశోక్ కుమార్ పర్ణశాలలోని నారచీరల ప్రాంతాన్ని శుక్రవారం సందర్శించారు. అక్కడి సీసీ రోడ్డు దెబ్బతిని వాహనాలు దిగేందుకు ఇబ్బందిగా మారడంతో కంకర పోసి మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. అలాగే పర్ణశాలకు వెళ్లే రహదారిలో నీళ్ల రోడ్డుపై పారుతూ వాహనాలకు ఇబ్బందికరంగా మారడంతో డోజర్ వాహనంతో దగ్గరుండి చదును చేయించారు. ఆయన వెంట ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బాలవెలుగు విద్యార్థులకు అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయతీ సంతోష్‌నగర్‌లోని శ్రీవిద్యాభ్యాస(బాలవెలుగు) పాఠశాల విద్యార్థులకు బీటీపీఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ వారి సహకారంతో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీటీపీఎస్ సీఈ బిచ్చన్న హాజరయ్యారు. చలికాలం ప్రారంభం కావడంతో తొలుత బాలవెలుగు విద్యార్థులకు సీఈ బిచ్చన్న చేతుల మీదుగా స్వెట్టర్లు, దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం సీఈ మాట్లాడారు. కార్యక్రమంలో బీటీపీఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, బాలవెలుగు నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా రాంబాబు



ములకలపల్లి: సీపీఎం మండల కార్యదర్శిగా ముదిగొండ రాంబాబు ఎన్నికయ్యారు. పార్టీ మండల 9వ మహాసభలో నూతన మండల కమిటీని ప్రకటించారు. మాదారం గ్రామానికి చెందిన రాంబాబును మరోమారు కార్యదర్శిగా నియమిస్తూ ఏకగ్రీవంగా ప్రకటించారు. నూతన మండల కార్యదర్శివర్గంలో ఊకంటి రవికుమార్, గౌరి నాగేశ్వరరావు, పొడియం వెంకటేశ్వర్లు, మాలోతు రావూజా, నిమ్మల మధు, పాయం అమలకు చోటు దక్కింది. అదేవిధంగా మరో 22 మందితో నూతన మండల కమిటీని ప్రకటించారు.

108 వాహనం ఏర్పాటు చేయాలి

అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలో తక్షణమే 108 అంబులెన్స్ వాహనాన్ని కేటాయించాలని స్థానిక ఆదివాసీ నాయకుడు టి.రవి కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వైద్యురాలికి వినతిపత్రాన్ని అందించారు. మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితిలో దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి నుంచి వాహనాలు వచ్చే సరికి ఆలస్యమై, పేదల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని, తక్షణమే స్థానిక ఎమ్మెల్యే పట్టించుకుని 108 వాహనాన్ని కేటాయించాలని కోరారు. వినతిపత్రాన్ని అందించిన వారిలో కారం నాగేంద్రబాబు, రాజా ఉన్నారు.

వరి దిగుబడి.. దిగాలు

- గణనీయంగా తగ్గిన ధాన్యం దిగుబడి
- సన్నరకం వరికి తెగుళ్ల ఉధృతి


హార్వెస్టర్‌తో వరికోత..


తెగుళ్లతో ఎండిపోయిన వరిపంట

బూర్గంపాడు: ఈ ఏడాది సన్నరకం వరిని సాగు చేసిన రైతులకు దిగుబడులు ఆందోళన కలిగిస్తున్నాయి. సన్నరకం వరికి తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉండటంతో ధాన్యం దిగుబడులు గణనీయంగా తగ్గాయి. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది ఎకరాకు 10 నుంచి 15 బస్తాల వరకు ధాన్యం దిగుబడులు తగ్గుతున్నాయి. ప్రస్తుతం వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే దిగుబడులు మాత్రం రైతులకు గుబులు పుట్టిస్తున్నాయి. ఎకరాకు 25 నుంచి 30 బస్తాల (75కిలోలు) దిగుబడి మాత్రమే వస్తుంది. దీంతో రైతులు పెట్టుబడులు కూడా రావని కలత చెందుతున్నారు. తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో దిగుబడులు మరింతగా తగ్గుతున్నాయి. కొన్నిచోట్ల ఎకరాకు 15 నుంచి 20బస్తాల దిగుబడులు మాత్రమే వస్తున్నాయి.

సన్నరకం వరి సాగు చేస్తే రైతులకు క్వింటాకు రూ.500 వరకు బోనస్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రైతులు 80శాతం మేరా భూములలో సన్నరకం వరిని సాగు చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఈ ఏడాది సన్నరకం వరికి తెగుళ్ల ఉధృతి ఎక్కువైంది. తాటాకు తెగులు, ఆకుమచ్చ తెగులు, సుడిదోమ వరిపంటను ఆశించి తీవ్రంగా నష్టపరిచాయి. వరి కంకి వెళ్లే తరుణంలో ఈ తెగుళ్లు ఆశించటంతో నష్టం ఎక్కువగా జరిగింది. తెగుళ్లతో కంకులు సరిగా పాలుపోసుకోక గింజ తాలుగా మారింది. దీంతో దిగుబడులు సగానికి తగ్గిపోయాయి. రైతులు తెగుళ్ల నుంచి వరి పంటను కాపాడుకునేందుకు ఈ ఏడాది ఐదారుసార్లు రసాయనిక మందులు పిచికారీ చేశారు. ఎక్కువ ధర కలిగిన మందులు పిచికారీ చేసిన పెద్దగా ఫలితం లేకుండా పోయింది. ఎకరాకు తక్కువలో తక్కువగా రూ 10వేల వరకు ఫెస్టిసైడ్స్‌కు ఖర్చు చేశారు. రైతులు ఎంత తిప్పలు పడిన పంటకు ఆశించిన తెగుళ్ల ఉధృతి తగ్గలేదు. దీంతో దిగుబడులు బాగా తగ్గుతున్నాయి.

ఈ ఏడాది రైతులు ఎకరా సన్నరకం వరిసాగుకు రూ.55వేలకు పైగా ఖర్చు చేశారు. ప్రస్తుతం ధాన్యం దిగుబడులు 25 బస్తాలకు మించటం లేదు. ఎకరాకు 18 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్మితే రైతులకు క్వింటాకు రూ.2320 చెల్లిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించింది. మొత్తంగా రైతులకు క్వింటాకు రూ.2,820 వచ్చే అవకాశాలున్నాయి. ఇందులో హమాలీ కాంటాలు, లోడింగ్, ఇతరత్రా క్వింటాకు రూ.200 వరకు ఖర్చవుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన బోనస్ వచ్చిన రైతులకు పెట్టుబడులు రావటం గగనమే ఆవుతుంది. బహిరంగ మార్కెట్‌లో కూడా సన్నరకం ధాన్యానికి ఈ ఏడాది డిమాండ్ తగ్గింది. గతంలో ఇతర రాష్ట్రాల మిల్లర్లు సన్నరకం ధాన్యాన్ని ఎగబడి కొనుగోలు చేసేవారు. ఈ ఏడాది పరిస్థితులు అందుకు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. పొరుగు రాష్ట్రాలలో కూడా ఈ ఏడాది వరిసాగు విస్తీర్ణం పెరగటం అందుకు కారణంగా తెలుస్తుంది. తెలంగాణలో ఇతర జిల్లాల్లో నెల రోజుల క్రితమే కొత్త ధాన్యం రైతుల చేతికందింది. గత నెలలో ఇతర జిల్లాలో సన్నరకం ధాన్యాన్ని మిల్లర్లు, ప్రైవేటు వ్యాపారులు చురుగ్గానే కొనుగోలు చేశారు. ప్రస్తుతం మాత్రం మార్కెట్ మందంగా ఉందని మిల్లర్లు, వ్యాపారులు కొనుగోళ్లకు ముందుకు రావటం లేదు. రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం అమ్ముకోవాల్సి వస్తుంది. రోజుల తరబడి కళ్లాల్లో ధాన్యం ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు.అక్కడ కొనుగోళ్లు ఆలస్యమవుతుండటంతో రైతులు రోజుల కొద్ది వేచిచూడాల్సి వస్తుంది. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

25 బస్తాలు కూడా రాలేదు



ఈ ఏడాది సన్న వడ్లు ఎకరాకు 25 బస్తాల దిగుబడి కూడా రాలేదు. తాటాకు తెగులు, ఆకుమచ్చ తెగులుతో వరి నిలువునా ఎండింది. వరికి ఐదారుసార్లు మందులు కొట్టినాం. అయినా ఫలితం లేదు.

– యదమకంటి నర్సింహారెడ్డి, రైతు, రెడ్డిపాలెం

బోనస్ చెల్లించాలి



వరికి తెగుళ్లు ఎక్కువయ్యాయి. ఎకరాకు 20 బస్తాలు కూడా రావటం లేదు. ఈ దిగుబడితో పెట్టుబడులు కూడా తిరిగి రావు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తే కొంత నష్టం తగ్గుతుంది. వడ్లు కొనుగోలు తొందర తొందరగా చేయాలి.

– ఉడుగుల సత్యం, రైతు, గొమ్మూరు

రైతులకు అసౌకర్యం కలిగించొద్దు


ధాన్యం తేమశాతాన్ని పరీక్షిస్తున్న డీసీఓ ఖుర్షీద్

ములకలపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో (పీసీసీ) రైతులకు అసౌకర్యం కలగకుండా చూడాలని జిల్లా సహకార అధికారి (డీసీఓ) సయ్యద్ ఖుర్షీద్ ఆదేశించారు. మండలపరిధిలోని రామచంద్రాపురం పీపీసీ సెంటర్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. యార్డులో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి, తేమ శాతాన్ని పరీక్షించారు. స్థానిక రైతులతో మాట్లాడి పంట దిగుబడి వివరాలు తెలుసుకున్నారు. తేమ శాతం 17 ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. సీనియర్ ఇన్‌స్పెక్టర్ వరుణ్‌బాబు, సీఈఓ కుంచారపు శ్రీనివాసరావు, డైరెక్టర్ బుబ్బూరి గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లను శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాచలం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చైతన్య, డిప్యూటీ డెమో మొహమ్మద్ ఫైజ్ మోహిఉద్దీన్‌లు మాట్లాడుతూ.. స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని అన్నారు. పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను సందర్శించి ఎఫ్ ఫాంపై ఆడిట్ నిర్వహించి, స్కానింగ్ మెషిన్ల పని తీరు, ఆస్పత్రి నిర్వహకులు ఏర్పాటు చేసుకున్న రిజిస్టర్‌లో నమోదు, అనంతరం స్కానింగ్ చేయించుకున్న గర్భిణుల నమోదు రిజిస్టర్‌ను పరిశీలించినట్లు తెలిపారు. ఎన్నిసార్లు వరుసగా స్కానింగ్‌కు వచ్చింది, ఏదైనా ఎంటీపీ, గర్భవిచ్ఛిత్తి జరిగిందా అన్న కోణంలో తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో పని చేసే వైద్యులు, వైద్య సిబ్బంది అన్ని రకాలుగా అర్హత కలిగి ఉండాలని, అనుమతులు లేని ఆస్పత్రులను, ల్యాబ్‌లను సీజ్ చేయడం జరుగుతుందని వారు హెచ్చరించారు.

కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరించిన ప్రజాపంథా నాయకులు

అశ్వారావుపేటరూరల్: దేశంలో రైతాంగం పండించిన అన్ని రకాల పంటలకు స్వామినాథన్ సిఫార్సులను తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్–ప్రజాపంథా కేంద్ర కమిటీ సభ్యుడు కెచ్చెల రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం అశ్వారావుపేట పార్టీ కార్యాలయంలో సంయుక్త కిసాన్ మోర్చా కరపత్రాలను ఆవిష్కరించి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం పంటలకు మద్దతు ధరలను కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. అదే విధంగా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు నిర్వహించే ఆందోళన కార్యక్రమాల్లో రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోగినపల్లి ప్రభాకర్, గన్నిన రామకృష్ణ, పండా ముత్యాలు పాల్గొన్నారు.

మరో ఉద్యమానికి సిద్ధం కండి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కనకయ్య

చర్ల: కొరెగడ్డ భూనిర్వాశితుల కోసం మరో ఉద్యమానికి సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. సీపీఎం చర్ల మండల 9వ మండల మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టు వల్ల నిర్వాశితులవుతున్న పేదల కోసం పోరాటం చేయడానికి పార్టీ సమాయత్తమవుతుందని ఆయన తెలిపారు. పేదలకు ఎటువంటి నష్ట పరిహారం ఇవ్వకుండా వేలాది మంది పేద రైతుల భూములను లాక్కోవడం అత్యంత దుర్మార్గమని ఆయన అన్నారు. తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు చేపట్టిన అదనపు గేట్ల నిర్మాణ పనులు నిలిచిపోయి ఏళ్లు కావస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. తక్షణమే అదనపు గేట్ల ఏర్పాటు పనులు చేపట్టాలని, చర్ల మండలంలో వద్దిపేట చెక్‌డ్యాం నిర్మాణాన్ని చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గోదావరి ముంపు ప్రాంతాల్లో ఉంటున్న వారందరికీ మెరక ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలను కేటాయించి ఇళ్లను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలగాని బ్రహ్మాచారి, పార్టీ జిల్లా సీనియర్‌నాయకులు ఎలమంచి రవికుమార్, మండల కార్యదర్శి మచ్చా రామారావు, మండల కమిటీ సభ్యులు కారం నరేష్, పొడుపుగంటి సమ్మక్క, బందెల చంటి, పామారు బాలాజీ, హరినాగవర్మ, తాటి నాగమణి, రాధాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట: విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని ప్రాంతాల్లో నేడు(శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్లు స్థానిక ట్రాన్స్‌కో ఏడీఈ వెంకటరత్నం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. అశ్వారావుపేట 132/33కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న కారణంగా ఈ సబ్ స్టేషన్ పరిధిలోని దమ్మపేట పరిధిలోని అంకంపాలెం, మల్కారం.. అశ్వారావుపేట, వినాయకపురం, నారంవారిగూడెం ఫీడర్‌లలో ఉదయం 9.30 గంటల నుంచి 11.30గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

వేములూరు గ్రామస్తుల శ్రమదానం


వేములూరు గ్రామంలో శ్రమదానం చేస్తున్న స్థానికులు

అశ్వాపురం: మండల పరిధిలోని మారుమూల గ్రామమైన మనుబోతులగూడెం గ్రామ పంచాయతీలోని వేములూరు గ్రామంలో స్థానికులు శుక్రవారం శ్రమదానం చేశారు. గ్రామస్తులు ఇంటికి ఒకరు స్వచ్ఛందంగా పాల్గొని రహదారికి ఇరువైపులా చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏనిక స్వరూప, శివాజీ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సున్నంబట్టిలో పశువైద్య శిబిరం

దుమ్ముగూడెం: మండలంలోని సున్నంబట్టి గ్రామంలో గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా పశు పశుగణాభివృద్ధి సంస్థవారి ఆధ్వర్యంలో గోపాల మిత్ర గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని పశువైద్యులు లిఖిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరానికి రైతులు 29 గేదెలు, 2 ఆవులు, 16దూడలను తీసుకురాగా.. వైద్యులు పరీక్ష చేసి అవసరమైన మందులు అందించారు. దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. ఈ కార్యక్రమంలో చర్ల పశు వైద్యులు సుధారాణి, జిల్లా గోపాలమిత్ర సూపర్‌వైజర్ లక్ష్మణ్, గోపాలమిత్రులు నరేష్, రాంబాబు వీఏ బాబ్జీ కుమార్, రవి కుమార్ రైతులు పాల్గొన్నారు.

సింగరేణి ఉచిత వైద్యశిబిరాలు


వైద్యపరీక్షలు చేస్తున్న మెడికల్ సూపరింటెండెంట్ శేషగిరిరావు

మణుగూరురూరల్: మండల పరిధిలోని తిర్లాపురం, బెస్తగూడెంలో సింగరేణి సేవ సమితి, మణుగూరు ఏరియా సింగరేణి వైద్యవిభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా వైద్యశిబిరాల్లో వివిధ రుగ్మతలతో బాధపడుతున్న 380మందికి ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శేషగిరిరావు, డాక్టర్ బెనర్జీలు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు దోమల నివారణ మందును పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ రూపశ్రీ, శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఆస్పత్రి ఆయాలు నాగసాయి, దేవకుమారి, ఆశావర్కర్లు మంగమ్మ, సీతకుమారి, దేవిరాధ, ఎండి.యూసుఫ్, కామరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గృహజ్యోతి వేడుకలు


గృహజ్యోతి వేడుకలో భాగంగా చర్చిలో కొవ్వొత్తులు వెలిగించిన క్రైస్తవులు

చర్ల: మండలంలోని కుదునూరులో శుక్రవారం రాత్రి గృహజ్యోతి వేడుకలు వైభవంగా సాగాయి. స్థానిక సెయింట్ మేరీస్ చర్చ్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో క్రైస్తవులు హాజరు కాగా.. పాస్టర్ ఎం.ప్రవీణ్ క్రీస్తు ఈ లోకానికి వచ్చిన విధానాన్ని వివరించారు. వెలుగుతున్న జ్యోతిని పోలి తామంతా నడుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చర్చ్‌లో క్రైస్తవులంతా క్యాండిల్స్‌ను వెలిగించుకుని ఆ వెలుగుతున్న క్యాండిల్స్‌ను తీసుకెళ్లి వారి ఇళ్లల్లో ప్రతిష్ఠించుకున్నారు. కార్యక్రమంలో పాస్ట్రేట్ కమిటీ సభ్యులు ఎం.కృపావరం, డి.అబ్రహం, టి.యేసుబాబు, టి.సాగర్, డి.సలోమీ, ఎం.పుష్పం, ఎన్.నందినిలతో పాటు క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

26న కలెక్టరేట్ ముట్టడి


సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు లక్ష్మీనారాయణ

దమ్మపేట: సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు దొడ్డా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం నిర్వహించిన మండల కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికుల విధానాలకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసి, ఉపాధి హామీ కనీస కూలీ రూ.600లు, పని దినాలను 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకు మండల పరిధిలోని అన్ని కార్మిక సంఘాలు కలసి సంయుక్తంగా ఈ నెల 26న జిల్లా కలెక్టరేట్ ముట్టడిని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల అర్జున్, కొప్పుల శ్రీను, పండూరి వీరబాబు, బెజవాడ రాము, ఖర్సం ముత్యాలరావు, ధర్మ, పిల్లి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: పంట రుణాలను మాఫీ చేయాలని, నాలుగు లేబర్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జాయింట్ ప్లాట్ ఫామ్స్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనియన్ నాయకులు కల్లూరి కిషోర్, ముదిగొండ రాంబాబు, నరాటి రమేష్ మాట్లాడారు. పోతుగంటి లక్ష్మణ్, ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, నకిరకంటి నాగేశ్వరరావు, బైరు సాయి, వాంకుడోత్ వీరు పాల్గొన్నారు.

గుండాల: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలని కోరుతూ.. ఈ నెల 26న చేపట్టిన కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని అఖిలపక్షం రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా నాయకులు రేసు ఎల్లయ్య, బట్టు సురేష్ లు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికుల హక్కులను హరించే విధంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కానిస్టేబుల్ శిక్షణలో ప్రతిభ

- పోలీస్‌గా వ్యవసాయ కూలీ బిడ్డ
- నారంవారిగూడెం కాలనీ వాసి బాలకృష్ణకు బంగారు పతకం
- సంగారెడ్డిలోని శిక్షణలో ఆల్ రౌండర్‌గా ప్రతిభ

అశ్వారావుపేటరూరల్: ఏఆర్ కానిస్టేబుల్ శిక్షణలో అశ్వారావుపేట మండలానికి చెందిన ఓ అభ్యర్థి ఆల్ రౌండర్‌గా ఉత్తమ ప్రతిభ కనబరిచి సత్తా చాటాడు. ఎంతో కఠోరమైన పోలీస్ శిక్షణలో తన కంటూ ఓ ప్రత్యేకతను పొందాడు. వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని నారంవారిగూడెం కాలనీ గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు భూక్యా నాగేశ్వరరావు, పద్మ దంపతుల కుమారుడు భూక్యా బాలకృష్ణ నిజామాబాద్ జిల్లాలోని వ్యవసాయ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాడు. కళాశాలలో విద్యనభ్యసించే క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖలో 2021లో ఇచ్చిన కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో తొలి ప్రయత్నంలోనే ఉద్యోగానికి ఎంపికయ్యాడు. సంగారెడ్డి జిల్లాలో తొమ్మిది నెలల శిక్షణను విజయవంతంగా పూర్తి చేయడమే కాకుండా ఫైరింగ్, ఇండోర్, అవుట్‌డోర్ విభాగాల్లో తోటి అభ్యర్థులకంటే 1200 మార్కులకుగాను అత్యధికంగా 928.4 సాధించి బెస్ట్ ఆల్ రౌండర్‌గా ఎంపికయ్యాడు. దీంతోపాటు గోల్డ్ మెడల్ సాధించడం విశేషం. ఈ మేరకు గురువారం సంగారెడ్డిలో జరిగిన దిక్షాంత్ పరేడ్‌లో డీఐజీ రేమ రాజేశ్వరి(ఐపీఎస్), జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి, జిల్లా ఎస్పీ చెన్నూరి రమేష్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్‌తోపాటు ట్రోఫి, జ్ఞాపికను అందుకున్నాడు. అంతేకాదు దిక్షాంత్ పరేడ్‌కు పరేడ్ కమాండర్‌గా కూడా వ్యవహరించడం గమనార్హం. శిక్షణ పూర్తి కావడంతో శుక్రవారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరాడు. ఈ సందర్భంగా బాలకృష్ణ 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడుతూ..వ్యవసాయ కూలీ పనులు చేస్తూ, తల్లిదండ్రులు ఉన్నత విద్యను చదివిస్తున్నారని, వారి కష్టాన్ని వృథా కానీయకుడదనే పట్టుదలతో ఒక వైపు విద్యనభ్యసిస్తూనే మరో వైపు పోలీస్ ఉద్యోగాన్ని సాధించానని అన్నారు. నా జీవిత ఆశయం ఐపీఎస్ కావడమే ప్రధాన లక్ష్యమని, ఆ లక్ష్యాన్ని కూడా సాధిస్తాననే నమ్మకం ఉందన్నారు.


దిక్షాంత్ పరేడ్‌లో ఉన్నతాధికారుల నుంచి ట్రోఫీ అందుకుంటున్న బాలకృష్ణ


పరేడ్ అనంతరం తల్లిదండ్రులతో..